సాక్షి
చిత్తూరు
గురువారం । 3 । అక్టోబర్ । 2024



మహాత్ముడి బాటలో పయనిద్దాం

గాంధీ జయంతి సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. - 8లో



'మూగ' వేదన!

మానవ తప్పిదానికి వన్యప్రాణులు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో అటవీ శాఖ జంతు సంరక్షణ వారోత్సవాలు చేపట్టింది. - 8లో



పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి మండలంలో రైతులు సాగు చేసిన పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. - 8లో

న్యూస్‌రీల్

కల్తీ 'బాబు' రాజీనామా చేయాలి

చిత్తూరు అర్బన్: తిరుమల లడ్డూపై కల్తీ రాజకీయం చేసి కోట్లాది మంది హిందువుల మనోభావాలను కించపరచిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ఆ పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు సూర్యప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన చిత్తూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యిందన్నారు. దీన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై నిందలు వేస్తూ తిరుమల శ్రీవారిని రాజకీయాల్లోకి లాగిందని చెప్పారు. నిరాధారమైన చంద్రబాబు వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సైతం తప్పుపట్టిన నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేసి, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. సుప్రీంకోర్టు సైతం లడ్డూ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించి, స్వీయ పర్యవేక్షణలో సుప్రీం రిటైర్డ్ జడ్జితో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

చిన్నారికి 'మనం' సాయం



చెక్కును అందిస్తున్న మనం ఫౌండేషన్ ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : చిన్నారి అలీజా వైద్యం కోసం మనం ఫౌండేషన్ నిర్వాహకులు రూ.77,250ను అందజేశారు. ఇటీవల నగరంలోని ఆటో డ్రైవర్ సాయిప్రేమ్ కుమార్తె అలీజాపై మరుగుతున్న పాలు పడడంతో ఒళ్లంతా కాలిపోయింది. ఆ చిన్నారి చికిత్సకు వేలూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. సాయి ప్రేమ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్ కావడంతో ఆయన ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మనం ఫౌండేషన్ నిర్వాహకులు గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. రూ.77,250 చెక్కును అలీజా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ సభ్యులు యుగంధర్, మురళి, ఢిల్లీగణేష్, రెడ్డి మస్తాన్, శివ, చకిత ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటిసంద్రం



పుంగనూరులో బాలిక అంత్యక్రియలకు హాజరైన స్థానికులు (ఇన్‌సెట్) మృతురాలు అశ్వియ అంజుమ్ (ఫైల్)

మానవత్వం మంటగలిసింది. ముక్కుపచ్చలారని పసిబిడ్డను పైశాచికత్వం కబళించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులను తీరని శోకంలో ముంచేసింది. పుంగనూరులో ఏడేళ్ల బాలిక అదృశ్యమైన ఘటన చివరకు విషాదాంతంగా మారింది. నాలుగు రోజుల ఎదురుచూపులకు నిర్వేదమే మిగిలింది. బుజ్జితల్లిని విగతజీవిగా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో చూసిన వారి హృదయం చలించిపోయింది. అభం శుభం తెలియని బాలికను పాశవికంగా హతమార్చడంపై ఆవేదనతో నిండిపోయింది.



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి బాలిక మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

పుంగనూరులో విషాదం

- సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో తేలిన బాలిక శవం
- నాలుగు రోజుల పోలీసుల దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు దొరకని వైనం

పుంగనూరు : పట్టణంలోని యాబీ కాంపౌండుకు చెందిన అజ్మతుల్లా కుమార్తె అశ్వియఅంజుమ్ (7) గత నెల 29న రాత్రి 7 గంటల సమయంలో పక్కింటిలో ఆడుకునేందుకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రులు గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పుంగనూరుకు చేరుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాలను చిత్తూరు, రాయచోటి నుంచి తెప్పించారు. బాలిక ఇంటి నుంచి ఉబేదుల్లా కాంపౌండులోని పలు వీధుల్లో పరుగులు తీసిన పోలీస్ జాగిలాలు చెంగలాపురం రోడ్డులోని ముళ్ల పొదల వద్ద ఆగిపోయాయి. తిరిగి రెండో సారి ఇంటి నుంచి జాగిలాలతో పరిశీలన చేపట్టారు. రెండవ సారీ అదే ప్రాంతంలోకి వచ్చి ఆగిపోవడంతో పోలీసులు, వందల సంఖ్యలో ముస్లిం యువకులు కలసి ముళ్లపొదల్లో గాలింపు చేపట్టారు. కానీ బాలిక ఆచూకీ లభించలేదు. ఇలా ఉండగా బాలిక తల్లిదండ్రుల కాల్‌డేటాను, పట్టణంలోని సీసీ కెమెరాలలోని డేటాను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి అనంతపురం డీఐజీ హిమోషి పుంగనూరు చేరుకుని ఎస్పీతో కేసు దర్యాప్తుపై చర్చించి, పలు సూచనలు చేసి వెళ్లారు.

బాలిక ఒంటిపై గాయాలు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై పడి ఉన్న అశ్వియ అంజుమ్ దుస్తులపై రక్తపు మరకలు, ఒంటిపై గాయాలు ఉన్నట్లు శవాన్ని వెలికితీసిన ముస్లిం యువకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలికను కిడ్నాప్ చేసి చెంగలాపురం ముళ్ల పొదల్లోకి తీసుకొచ్చి అక్కడ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడవేసి ఉంటారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో పోలీస్ జాగిలాలు రెండు సార్లు వచ్చి ఆగిపోవడం గమనార్హం. దీనిని బట్టి దుండగులు బాలికను అక్కడికి తీసుకొచ్చి తరువాత కారులో కానీ, ఆటోలో కానీ వెళ్లి ఉంటారని, ఈ కారణంగా జాగిలాలు ఆచూకీ కనుగొనడంలో విఫలమయ్యాయన్న భావన వ్యక్తమవుతోంది.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

చిన్నారి అశ్వియఅంజుమ్ మృతదేహానికి స్థానిక ఆస్పత్రిలో ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఆస్పత్రికి సమీపంలోని ముస్లింల శ్మశాన వాటికలో బాలిక అంత్యక్రియలు నిర్వహించారు. వేలాది మంది స్థానికులు కన్నీటితో బాలికకు వీడ్కోలు పలికారు. ఈ సంఘటన స్థానికుల గుండెలను కలచివేసి పట్టణాన్ని విషాదంలో ముంచింది.

తెలిసిన వారి పనేనా?

అజ్మతుల్లా వడ్డీ వ్యాపారిగా ఉన్నప్పటికీ లావాదేవీల వ్యవహారమైతే బాలికను కిడ్నాప్ చేసి సొమ్ము డిమాండ్ చేసి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే అలాంటి సంఘటనలు జరగలేదు. బాలిక ఎంతో హుషారుగా, చురుగ్గా ఉండేదని, కొత్తవాళ్లు బాలికను తీసుకెళ్లేందుకు వీలు లేదని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. తెలిసినే వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఆరోపిస్తున్నారు.

గంజాయి బ్యాచ్‌పై అనుమానం

పట్టణంలోని చెంగలాపురం, భగత్‌సింగ్ కాలనీ, దోబీ కాలనీ, కోనేటిపాళెం, ఎన్ఎస్.పేట ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలు అధికంగా లభిస్తున్నాయి. యువత మత్తుకు బానిసలవుతున్నారు. యువకులు మత్తులో బాలికను కిడ్నాప్ చేసి, చెంగలాపురం ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ కోణంలో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శ

ఈ విషాదకర ఘటన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఫోన్ ద్వారా అజ్మతుల్లా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలిక మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దర్యాప్తు ఇలా...

బాలిక అశ్వియఅంజుమ్ అదృశ్యమైందనే కోణంలో పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. బాలిక తండ్రి అజ్మతుల్లా వడ్డీవ్యాపారి కావడంతో పోలీసుల దర్యాప్తు ఆ కోణంలో సాగింది. కానీ పోలీసులకు నాలుగురోజుల్లో చిన్న క్లూ కూడా లభించలేదు. చిన్నారిని కిడ్నాప్ చేసిన అగంతకుల ఆచూకీని పుంగనూరు పోలీసులు కనిపెట్టలేకపోయారు. పోలీసుల దర్యాప్తు పట్టణానికే పరిమితమైంది. కానీ ఇంటికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో చిన్నారి మృతదేహం లభించడం పలు అనుమానాలకు దారితీస్తోంది.



పుంగనూరులో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల రోదనలు



బాలిక తండ్రి అజ్మతుల్లాను పరామర్శిస్తున్న ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి

ప్రైవేట్‌గా సైఖితం!



చిత్తూరు రూరల్ మండలం పాలూరు ఇసుక పాయింట్

- ప్రభుత్వ పాయింట్లలో ఇసుక నిల్ • తమ్ముళ్ల రీచ్‌ల వద్ద నిల్వలు ఫుల్
- అక్రమ తవ్వకాలు.. అమ్మకాలకు ప్రత్యేకంగా కాంట్రాక్టర్లు
- ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు
- పచ్చమూక అనుమతి లేకుంటే తప్పని కేసులు
- ఇసుక దొరక్క ఆగిపోతున్న నిర్మాణాలు

"తమ్ముళ్లూ మన ప్రభుత్వం వస్తే ఇసుకను ఉచితంగా ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా. గుర్తుపెట్టుకోండి.. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇసుక ఫ్రీ" అని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఉచితాన్ని కాస్తా అనుచితంగా మార్చేశారు. పేరుకు సర్కారు ఇసుక పాయింట్లు ఏర్పాటు చేశారు. చాటుగా పచ్చమూకను రంగంలోకి దింపేసి ప్రైవేట్ రీచ్‌లు పెట్టించేశారు. ఇక అప్పటి నుంచి వాగులు.. వంకలు.. నదుల్లో సై'ఖతం' మొదలైంది. కూటమి నేతల ధనదాహానికి ఇసుక ఎక్కడికక్కడ అదృశ్యమవుతోంది. ప్రభుత్వ పాయింట్‌లు ఖాళీగా ఉండడంతో భవన నిర్మాణ పనుల కోసం ప్రతి ఒక్కరూ ప్రైవేట్ రీచ్‌లపైనే ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. అక్కడ టీడీపీ నాయకులు చెప్పిందే రేటుగా మారిపోయింది.

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఇసుక విషయంలో కూటమి ప్రభుత్వం చెప్పింది ఒకటి.. చేస్తున్నది మరొకటి. పార్టీ నాయకుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. పేరుకే ఉచిత ఇసుక. అంతకు అంత డబ్బులు పెట్టిందే దొరకడం లేదు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నేతలకు ప్రభుత్వ విధానం కాసుల వర్షం కురిపిస్తోంది. సర్కారు ఏర్పాటు చేసిన రీచ్‌ల వద్ద ఇసుక అందుబాటులో ఉంచామని చెబుతున్నారు. తీరా వ్యయ ప్రయాసలకోర్చి వెళితే అక్కడ ఇసుక దొరకడం లేదు. రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పది ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపింది. అయితే ఇప్పటి వరకు ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ సౌకర్యం ఉన్నా.. 25 శాతం ఇసుకను నిబంధనల ప్రకారం విక్రయిస్తుండగా.. 75 శాతం ఇసుకను టీడీపీ నేతలే కొనుగోలు చేసి బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

చిత్తూరు జిల్లా

అసెంబ్లీ నియోజకవర్గాలు	టీడీపీ నేతల రీచ్‌లో లారీ ఇసుక ధర (రూ.లో)
1. కుప్పం	36,000
2. పలమనేరు	26,000
3. పుంగనూరు	32,000
4. పూతలపట్టు	22,000
5. చిత్తూరు	20,000
6. గంగాధరనెల్లూరు	18,000
7. నగరి	27,000

తిరుపతి జిల్లా..

అసెంబ్లీ నియోజకవర్గాలు	టీడీపీ నేతల రీచ్‌లో లారీ ఇసుక ధర (రూ.లో)
1. తిరుపతి	23,600
2. చంద్రగిరి	42,600
3. శ్రీకాళహస్తి	31,600
4. సత్యవేడు	19,600
5. సూళ్లూరుపేట	21,600
6. గూడూరు	18,600
7. వెంకటగిరి	28,000

ఏడాదికి రూ.5 కోట్లు

తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ రీచ్‌లు, స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినా అక్కడ ఇసుక లభ్యం కావటం లేదు. టీడీపీ, జనసేన నేతలు ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు రీచ్‌ల వద్ద కావలసినంత ఇసుక దొరుకుతోంది. స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో చంద్రగిరి, పాడిపేట, గాజులమండ్యం, పాపానాయుడుపేట, పెనుమల్లం, గోవిందవరం, ముసిలిపేడు, మోదుగులపాళెం, అబ్బాపట్ల పల్లె, పుల్లారెడ్డి కండ్రిగ, అమ్మపాళెం, శ్రీకాళహస్తి, చెంబేడు, కలవకూరు, పెళ్లకూరు, నాయుడుపేట, భీమవరం, మర్లపల్లె, అన్నమేడు, చిట్టమూరు మండల పరిధిలోని గుణపాడు, కోట మండల పరిధిలోని గూడలి, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం కూడలి, గూడూరు మండలం కైవల్యానది, కాళంగి, కరుణానది, అరుణానదీ, నీవా, కౌండిన్య నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ తవ్వకాలు, అమ్మకాల కోసం అధికారపార్టీ నేతలు ప్రతి నియోజక వర్గానికి ఓ కాంట్రాక్టర్‌కి బాధ్యతలు అప్పగించారు. సదరు వ్యక్తి నియోజక వర్గంలో ఇసుక తవ్వి విక్రయించుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం ఆ కాంట్రాక్టర్ అధికారపార్టీ నేతకు ఏడాదికి రూ.5 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అర్ధరాత్రి దాటాకే అక్రమాలు

ఇసుక అక్రమ తవ్వకాలన్నీ ప్రతి రోజూ అర్ధరాత్రి దాటాకే జరుగుతున్నాయి. అంతా నిద్రలోకి జారుకున్నాక అక్రమార్కులు నిద్రలేస్తారు. ఆయా ప్రాంతాల్లో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వాహనాల ద్వారా స్థానికులకు విక్రయించడంతో పాటు.. కంటైనర్ల ద్వారా చెన్నై, బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరో వైపు రైతుల అనుభవంలో ఉన్న డీకేటీ భూములను టీడీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించి ఇసుకను తవ్వి విక్రయించేస్తున్నారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజక వర్గాల పరిధిలో సాగులో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. తిరుపతి రూరల్ మండలం పాడిపేట, ఏర్పేడు మండలం పెనుమల్లం వద్ద వెలుగుచూసిన టీడీపీ నేతల బాగోతమే ఇందుకు నిదర్శనం. డీకేటీ పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో టీడీపీ నేతలు దౌర్జన్యంగా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వందలాది వాహనాల ద్వారా తరలించేస్తున్నారు. టీడీపీ నేతల అనుమతి లేకుండా ఎక్కడా ఎవరూ ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. ఒక వేళ ఇసుక తవ్వి తరలిస్తుంటే వారిని వెంటాడి భారీగా నగదు వసూలు చేస్తున్నారు. సొమ్ము చెల్లించని వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారు.



గంగవరం: నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేని దృశ్యం

ఇసుక విక్రయాల్లో తమ్ముళ్ల చేతివాటం

- వెంకటగిరి మండలం మొగళ్లగుంట వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇసుక లేకపోవడంతో టీడీపీ నేతలు అక్కడకు సమీపంలోనే అక్రమ రీచ్ ఏర్పాటు చేసుకుని టన్ను ఇసుకను రూ.500 చొప్పున యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మావిళ్లపాడు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్‌లో తొలి రెండు రోజులు మాత్రమే ఇసుక లభ్యమైంది. పక్కనే టీడీపీ నేతల డంప్ వద్ద టన్ను రూ.365 నుంచి రూ.500 చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.
- సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఇసుక లేదు. స్వర్ణముఖి నది వద్ద టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక రీచ్‌లో టన్ను రూ.250 చొప్పున విక్రయిస్తున్నారు.
- పిచ్చాటూరు మండలం అడవికోయంబేడులో ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక కరువు. అయితే పక్కనే ఉన్న వాగు నుంచి టీడీపీ నేతలు ప్రతి రోజూ రాత్రి వందకు పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ టన్ను ఇసుక రూ.400 చొప్పున అమ్మేస్తున్నారు.
- గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రభుత్వం స్టాక్ పాయింట్‌లో చాలా కాలం నుంచి ఇసుక దొరకడం లేదు. టీడీపీ నేతలు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న రీచ్‌ల వద్ద టన్ను ఇసుక రూ.1,500కు విక్రయిస్తున్నారు.
- చిత్తూరు రూరల్ మండలంలో రెండు ఇసుక పాయింట్లు ఉన్నాయి. ఒకటి దిగువమాసాపల్లె, పాలూరు. ప్రస్తుతం పాలూరు పాయింట్‌లో ఇసుక లేదు. దిగువమాసాపల్లె వద్ద ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే అవకాశముంది. అయితే టీడీపీ నేతలే ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసి, ప్రైవేటుగా టన్ను రూ.వెయ్యి చొప్పున అమ్ముకుంటున్నారు.



శ్రీకాళహస్తి సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వుతున్న దృశ్యం

నేటి నుంచి దసరా సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించకూడదన్నారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా తరగతులు నిర్వహిస్తే అటువంటి యాజమాన్యాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలు తిరిగి ఈ నెల 14న పునఃప్రారంభించాలని డీఈఓ వెల్లడించారు.

నేడే టెట్

- సందేహాలుంటే 90321 85001కు కాల్ చేయండి



చెన్నైలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ ఎలిజిబులిటీ పరీక్ష (టెట్)ను గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 4 కేంద్రాలు, తమిళనాడులోని చెన్నైలో 2 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర అబ్జర్వర్ ప్రసన్న కుమార్ చెన్నైలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ నుంచి డిపార్ట్‌మెంట్ అధికారులతో, టెక్నికల్ సిబ్బందితో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పరీక్ష ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. చిత్తూరు జిల్లాలో నాలుగు (సీతమ్స్, వేము, ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలు), పలమనేరులో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, చెన్నైలో కుండ్రత్తూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్, వనాగరమ్‌లోని ప్రయాగ టెక్నాలజీస్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు చిత్తూరు జిల్లాలో 5,893 మంది, చెన్నైలో 983 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదు. ఎలాంటి సమస్యలైనా డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ 9032185001కు కాల్‌చేసి పరిష్కరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లి, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లి, జిట్టంవారిపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి పలమనేరు ఫారెస్టు రేంజ్ కీలపట్ల బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామ సమీపంలోని పంటలను తొక్కి నాశనం చేశాయి. బుధవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధితుల సమాచారంతో రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేటు మద్యం పాలసీని రద్దు చేయాలి



నిరసన ర్యాలీ చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

పలమనేరు: ప్రైవేటు మద్యం పాలసీని రద్దు చేసి ప్రభుత్వం ద్వారానే మద్యం దుకాణాలను నిర్వహించాలని ఐద్వా జిల్లా నాయకురాలు భువనేశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక ఐద్వా కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం ప్రైవేటు మద్యం పాలసీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. భువనేశ్వరి మాట్లాడుతూ ప్రైవేటు విధానం కారణంగా పల్లెల్లో సైతం బెల్టుషాపులు పెరిగిపోతాయని చెప్పారు. మద్యానికి బానిసలైన వారి కోసం డీ అడిక్షన్ సెంటర్లను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం మద్యం ద్వారా ఆదాయాన్ని పొందాలని చూస్తుందే గానీ ప్రజల ఆరోగ్యంపై ఏమాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. త్వరలో రాష్ట్రం మద్యాంధ్రగా మారడం ఖాయమని ఇందుకు చంద్రబాబే కారణమని విమర్శించారు.

మూగ వేదన!

ఈ భూమిపై మనకు జీవించే హక్కు ఎలా ఉందో.. అలాగే ప్రతి జీవికీ జీవించే హక్కు ఉంది. ఇంకా చెప్పాలంటే మనం ఈ భూమిపైకి అతిథులుగా వచ్చాం. అతిథులుగా చూసి వెళ్లిపోవాల్సిందే. కానీ మానవ తప్పిదాల వల్ల ఎక్కడో అడవుల్లో ఉన్న జంతువులు నేలకొరుగుతున్నాయి. పరిస్థితి చేయిదాటితే జీవ వైవిధ్యంలో సమతుల్యత దెబ్బతిని జంతువులకే కాదు.. మానవ మనుగడకూ ప్రమాదం ఏర్పడనుంది. అటవీ జంతువులను రక్షించుకోవడానికి ప్రతీ ఏటా అక్టోబర్ 2 నుంచి వన్యప్రాణుల సంరక్షణా వారోత్సవాలను అటవీశాఖ నిర్వహిస్తోంది.

- మానవ తప్పిదాలకు బలవుతున్న వన్యప్రాణులు
- జంతు ఆవాసాలకు నిలయంగా కౌండిన్య అడవులు
- వన్యప్రాణులను కాపాడుకోకుంటే.. కనుమరుగే
- జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు


నక్కల గుంపు

ఎన్నో జీవులు..

జిల్లాలో అటవీ ప్రాంతం దాదాపు 1.95 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఇందులో పలమనేరు, కుప్పం, నగరి, చిత్తూరు, పూతలపట్టు, గుడిపాల, పెనుమూరు, గంగాధరనెల్లూరు, పాలసముద్రం, ఎస్ఆర్.పురం ప్రాంతాల్లో అడవులు విస్తారంగా ఉన్నాయి. ఈ అడవుల్లో పులి, సింహం మినహా.. దాదాపు అన్ని రకాల జంతువులు జీవిస్తున్నాయి. ప్రధానంగా ఏనుగులు, హైనాలు, ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు, దేవాంగపిల్లి, దుప్పి, తోడేళ్లు, నక్కలు, అడవి కుందేళ్లు, పావురాలు, కోళ్లు, కొండచిలువ, అడవిపిల్లి, వేటకుక్కలు, తాచుపాము, నీళ్లపాము, తాబేలు వంటి 50 రకాల జాతులకు చెందిన జంతువులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా మన జిల్లాలో 110 ఏనుగులు ఉన్నాయి. ఇవి తమిళనాడు చుట్టు పక్కల ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఆహారం దొరక్కపోవడంతో తిరిగి ఇటువైపు వస్తున్నాయి. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఎక్కువగా సంచరిస్తుండగా అప్పుడప్పుడు పూతలపట్టు, పుంగనూరు, చిత్తూరు నియోజకవర్గాల వైపు ఆహారం కోసం వస్తుంటాయి.

చిత్తూరు కార్పొరేషన్/ చిత్తూరు అర్బన్: ఎక్కడో మారుమూల అడవులు, దట్టమైన ప్రాంతాల్లో మనుషులకు దూరంగా జీవిస్తున్న వన్యప్రాణుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. అడవుల్లోని జంతువులు చనిపోవడానికి 95 శాతం వరకు కారణాలు మానవ తప్పిదాలే. అడవుల్లో వేటకు వెళ్లడం, పంట పొలాలకు విద్యుత్ కంచెలు పెట్టడం, నీళ్ల కోసం.. ఆహారం కోసం రోడ్లపైకి వచ్చే జంతువులు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న ఘటనలు ఇటీవల జిల్లాలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా జిల్లాలోని జంతు ఆవాసానికి నిలయంగా ఉన్న కౌండిన్య అడవుల్లో మూగ జీవాలు ప్రాణాలు వదిలేస్తున్నాయి. వీటి మూగ వేదన ఎవరికీ అర్థం కావడంలేదు. ఇంట్లో కుక్క, పిల్లిని పెంచుకున్నట్లే అడవుల్లోని వన్య ప్రాణులపై ప్రేమ చూపించాలి. మనం వాటి జోలికి వెళ్లకుంటే చాలు. వాటి జీవితాన్ని అవి ప్రశాంతంగా గడిపేస్తాయి.

మనమేం చేస్తున్నాం..

మనుషులకు దూరంగా ఉన్న అడవుల్లో బతుకున్న వన్యప్రాణులకు మనుషులంటే చచ్చేంత భయం. ఎందుకంటే మనిషి తన సరదా, వ్యాపకం కోసం వన్య ప్రాణులను వేటాడం అలవాటుగా చేసుకున్నాడు. వన్యప్రాణుల సంరక్షణ కోసం కఠినమైన చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ, ఏటా మూగ జీవాల్ని తన తూటాలతో మట్టుపెడుతూనే ఉన్నారు. ఇక ఆహారం కోసం దారితప్పిన జంతువులు పంట పొలాల్లోకి వస్తుంటాయి. పంటల్ని రక్షించుకోవడానికి రైతులు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఎన్ని వోల్ట్ల విద్యుత్ కంచె ఏర్పాటు చేస్తే, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా, విద్యుత్ షాక్‌తో వెనుదిరుగుతాయనేది అటవీశాఖ అధికారులతో మాట్లాడి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెల వల్ల ఏనుగులు, అడవి పందులు, జింకలు, ఇతర వన్యప్రాణులు ప్రాణాలు వదిలేస్తున్నాయి. జంతువులు సంచరించే ప్రాంతాల్లో వాహనాలను నెమ్మదిగా నడపడం, రోడ్డు దాటుతున్న జంతువులను రెచ్చగొట్టడం, శబ్దాలు చేస్తూ వాటిపైకి వాహనాలు పోనివ్వడం కూడా అడవి జంతువుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. జంతువులను ప్రేమించి, వాటి సంరక్షణపై కనీస అవగాహన ఉంటే తప్ప అడవుల్లోని జీవ జాతుల్ని కాపాడుకునే పరిస్థితి ఉండదు.

కౌండిన్య రక్షణలో..

కౌండిన్యలో వైల్డ్ లైఫ్ ప్రాంతం 357.62 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అటవీశాఖ అధికారులు ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జంతువుల కదలికలు గుర్తిస్తున్నారు. జంతువుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా, చర్యలు కూడా తీసుకుంటున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు రేంజ్‌లను కలిపి రాయల్ ఎలిఫెంట్ రేంజ్‌గా పిలుస్తారు. కుప్పం రేంజ్ నుంచి పలమనేరు రేంజ్ వరకు కౌండన్య వైల్డ్‌లైఫ్ అభయారణ్యంగా పరిగణిస్తారు. కౌండిన్య అటవీ ప్రాంతంలో వన్యప్రాణి జంతువులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతేడాది జూన్‌లో నిర్వహించిన ఏనుగుల గణనలో ట్రాప్ కెమెరాల్లో పలు జంతువులు ఉన్నట్లు గుర్తించారు. కౌండిన్య అరణ్యం సకల జీవులకు నీడనిస్తూ వాటిని సంరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తోంది.


నీరు తాగుతున్న వన్యప్రాణులు


పలమనేరులో మృతి చెందిన ఏనుగు (ఫైల్)


చిత్తూరు: కుక్కలదాడిలో మృతి చెందిన దుప్పి(ఫైల్)


అడవిలో సంచరిస్తున్న ముళ్లపంది


సీసీ కెమెరాకు చిక్కిన ఎలుగుబంటి

అవగాహన కల్పిస్తున్నాం



వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి. జంతు సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నాం. వన్య ప్రాణుల వారోత్సవాల్లో విద్యార్థులకు అడవి జంతువులను ఎందుకు కాపాడుకోవాలి..? వాటిని ఎలా రక్షించుకోవాలి..? మన బాధ్యత ఏంటి..? అనే విషయాలపై వ్యాసరచన, వ్యకృత్వ పోటీలు కూడా పెడుతున్నాం. ఇక గ్రామాల్లో కరపత్రాల పంపిణీ, బైక్ ర్యాలీలు చేయనున్నాం. అడవి నుంచి బయటకు వచ్చిన జంతువులకు హానితలపెట్టొద్దు. అటవీ సిబ్బందికి సమాచారం ఇస్తే వాళ్లే వచ్చి వాటిని తీసుకెళతారు.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్ఓ, చిత్తూరు

జైలు జీవితం ఖైదీల్లో మార్పు తేవాలి


ఖైదీలకు బహుమతులు ఇస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్, జేసీ తదితరులు

చిత్తూరు అర్బన్: జైలు జీవితం అనేది శిక్ష కాదని.. తప్పు చేసిన వారిలో మార్పు తీసుకురావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం చిత్తూరు జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, న్యాయమూర్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ, ఖైదీలు ఆవేశంలో చేసిన తప్పులకు జైలు శిక్షను అనుభవిస్తుంటే, వారి కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న మానసిక బాధ ప్రతి ఒక్కరిలోనూ మార్పు తీసుకురావాలన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులు సంక్షేమ పథకాలు పొందేందుకు జైలు సూపరింటెండెంట్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఖైదీలు జైలులోకి వచ్చిన తరువాత వారి సంక్షేమ బాధ్యత అధికార యంత్రాంగానిదేనన్నారు. ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, న్యాయమూర్తులు పద్మజ, వెన్నెల, జైలు పర్యవేక్షణాధికారి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జైల్లో ఉంటూ పదో తరగతి ఉత్తీర్ణులైన ఖైదీలకు సర్టిఫికెట్లను అందించారు. ఖైదీలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

ఊరినే మింగేస్తా.. టీడీపీ నేత నిర్వాకం


అక్రమ క్వారీ ముఖద్వారం (ఇన్‌సెట్) బాధిత రైతు పాపన్న

కుప్పంరూరల్: క్వారీని అక్రమంగా నివాస గృహాల మధ్య నిర్వహిస్తూ, సమీపంలో ఉన్న రైతులపై దాడులకు తెగబడుతున్న టీడీపీ నాయకుడు ఏకంగా ఊరినే మింగేస్తానంటూ హెచ్చరించాడు. మండలంలోని ఊరునాయునిపల్లి వద్ద ఓ టీడీపీ నాయకుడు అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నాడు. నివాస గృహాలకు సమీపంలో క్వారీ ఉండడంతో గ్రామస్తులు పలు మార్లు అడ్డుకున్నారు. తాజాగా బుధవారం క్వారీ సమీపంలోని రైతు పాపన్న పొలంలోని చెట్లను టీడీపీ నేత నరికివేశాడు. దీనిపై ప్రశ్నిస్తే పాపన్న, కుటుంబ సభ్యులపై క్వారీ యజమాని బూతులు తిడుతూ దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని సైతం బెదిరించడంతో పెద్ద ఎత్తున గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన గ్రామస్తులను గమనించిన టీడీపీ నాయకుడు 'మీరెంత మంది వచ్చినా క్వారీ నిలిపేది లేదు.. ఊరినే మింగేస్తా జాగ్రత్త' అని అరుస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

'కూటమి'కి కాలం చెల్లుతోంది

చిత్తూరు కార్పొరేషన్: విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లుతున్నట్లు లెక్క అని కార్మికసంఘాల నాయకులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, డీహెచ్‌పీఎస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాజన్, సురేంద్రన్ మాట్లాడారు. ఎంతోమంది ప్రాణత్యాగాలతో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడిందన్నారు. తద్వారా ప్రత్యక్షంగా 40,000 మంది కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వేలాది మంది కుటుంబాలను రోడ్డున పడేయడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో కాలం చెల్లినట్టేనని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ముగంరెడ్డి, విజయకుమార్, రఘు, సాయి, సత్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

నాలుగు నెలల్లోనే తేడా తెలుసుకున్నారు

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

సదుం: ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు గత వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనకు ఉన్న తేడాను నాలుగు నెలల్లోనే ప్రజలు గుర్తించారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులతో ఆయన బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న మరికొద్ది రోజుల్లోనే వైఎస్సార్ సీపీపై, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజలకు మరింత విశ్వాసం చేకూరుతుందని స్పష్టం చేశారు. త్వరలోనే విద్యుత్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోందని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో నిర్వహించే కార్యక్రమాలకు సైతం హాజరవుతానని, కార్యకర్తందరూ పాల్గొనాలని చెప్పారు. సమస్యలపై తనను నేరుగా కలవచ్చని సూచించారు. ఎన్నికల ఫలితాల సమయంలో కంటే ఇప్పుడు నాయకుల్లో మరింత ధైర్యం కనపడుతోందని చెప్పారు. ఇది శుభసూచకమన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని, ఏసమస్య ఉన్నా తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

మూడు గంటల పాటు వినతుల స్వీకరణ

సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరితోను ఎంపీ మాట్లాడారు. సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుమారు మూడు గంటలకు పైగా వినతులు స్వీకరించి, సమస్యలు ఆలకించారు. నాయకుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పులిచర్ల ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, అమాస మోహన్, నాగేశ్వరరావు, భరత్, ఇమ్రాన్, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బైరెడ్డిపల్లె: మండలంలోని పుంగనూరు–బైరెడ్డిపల్లె రహదారిపై చిన్నచల్లారగుంట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆకులకొత్తూరుకు చెందిన యుంగంధర్‌గౌడు, చలగానిపల్లెకు చెందిన గిరిరాజా నాలుగు రోడ్ల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ సంఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో కుప్పం పీఈఎస్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం పోలీసులు రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. పాతబస్టాండులో మోహన్(63), శంకర్(43) నుంచి 48 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. దీంతో పాటు రూ.6వేల నగదు సీజ్ చేశారు. పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గొల్లపల్లెమ్మ ఆలయంలో నగల చోరీ

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత గ్రామ పంచాయతీ గొల్లపల్లెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఆలయ పూజారి రామయ్య కథనం మేరకు, బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లిన పూజారికి హుండీ చోరీ అయినట్లు గుర్తించారు. గొల్లపల్లెమ్మ అమ్మవారి నగలు, బీరువాలోని పట్టు చీరలు, వెండి నగలను చోరీ చేశారని తెలిపారు. హుండీని పగలగొట్టి నగదు తీసుకుని హుండీని ముళ్లపొదల్లో పడేసినట్లు చెప్పారు. అక్కడే మద్యం తాగినట్లు సీసాలు కూడా ఉన్నట్లు వివరించారు. ఆలయంలో సీసీ కెమెరాలున్నప్పటికీ 3 నెలలుగా పని చేయడం లేదని చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సుబ్బారెడ్డి ఆలయాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


గొల్లపల్లెమ్మ ఆలయంలో పగలగొట్టిన బీరువా


ముళ్ల పొదల్లో పడవేసిన హుండీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వినోద్ కుమార్ (58) బుధవారం మృతి చెందాడు. స్వామి మేస్త్రి వీధికి చెందిన వినోద్ కుమార్ తన భార్య పిల్లలు దూరంగా ఉండడంతో, మనస్థాపానికి గురి మంగళవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వేలూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాత్ముడి బాటలో పయనిద్దాం


నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : మహాత్మా గాంధీ ఆదర్శాలను అనుసరిస్తూ బాపూ బాటలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రెండు వారాల పాటు స్వచ్ఛతా హి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ సేవ కార్యక్రమాలను చిత్తూరు నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. చిత్తూరులో పీసీఆర్ కళాశాల, తాలూకా పోలీస్ స్టేషన్ వంటి పాత భవనాలను పునర్ నిర్మించేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తూ నగరపాలక ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా స్ఫూర్తి ని చాటుతూ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఆర్డీఓ శ్రీనివాసులు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కటారి హేమలత, కార్పొరేటర్లు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజుతోపాటు ఆ పార్టీ అనుబంధ సంఘం నాయకులు గాంధీజీకి నివాళులర్పించారు.